بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 02 January 2026 (Telugu)

# మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడైన హజ్రత్ అక్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం దైవ (అల్లాహ్) ప్రేమ గూర్చి విశ్వాసభరిత ఆసక్తికర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 02.01.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలో అల్లాహ్ పట్ల గల ప్రేమకు సంబంధించి పవిత్ర మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఉత్తమ ఆదర్శం గురించి వివరించబడింది. ఈ కాలంలో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం, తన యజమానిని అనుసరిస్తూ దైవ ప్రేమలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పారు. దీని ఫలితంగా అల్లాహ్ తఆలా అనుగ్రహాలు ఆయన (అ) పై కురిశాయి మరియు దేవునిపై ఆయనకు ఉన్న ప్రేమను ప్రజలు కూడా అనుభూతి చెందారు. ఈ విషయంలో నేను కొన్ని సంఘటనలను వివరిస్తాను, అయితే అంతకంటే ముందు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం స్వయంగా తన మాటలలో ఈ ప్రేమను ఎలా వివరించారో పేర్కొంటాను.

ఒక చోట ఆయన అలైహిస్సలాం ఇలా ప్రవచించారు: నా లోని ఏ క్రియ వల్ల దైవిక అనుగ్రహం నాకు లభించిందో నేను వివరించలేను. కేవలం నా హృదయంలో దైవం పట్ల సహజంగా ఒక విధేయతతో కూడిన ఆకర్షణ ఉందని నేను అనుభూతి చెందుతాను, అది దేనివల్లనైనా సరే ఆగదు. కావున ఇది అతని అనుగ్రహమే. అంటే, అల్లాహ్ నాపై చూపిన ఈ అనుగ్రహాలన్నీ కేవలం నేను అల్లాహ్ ప్రియతమ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను సంపూర్ణంగా అనుసరించడం మరియు ప్రేమించడం వల్లే లభించాయి. దీని ఫలితంగానే అల్లాహ్ ప్రేమ తలుపులు నాపై తెరవబడ్డాయి.

మరోచోట వారు అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు: మసీదులే నా నివాసం, సత్యమూర్తులే (సాలిహీన్) నా సోదరులు, అల్లాహ్ స్మరణే నా ధనం మరియు అతని సృష్టియే (ప్రజలు) నా కుటుంబం. ఇంకో చోట ఇలా అన్నారు: మేము ప్రతి వస్తువును కేవలం అల్లాహ్ కోసమే ప్రేమిస్తాము. మళ్ళీ ఇలా సెలవిచ్చారు: దేవునితో మాకున్న సంబంధాన్ని ఏ వస్తువు విడదీయలేదు. అతని గౌరవం మరియు మహోన్నత సాక్ష్యంగా నేను చెబుతున్నాను, అతని ధర్మ గొప్పతనం వెల్లడి కావడం, అతని మహిమ

ప్రకాశించడం మరియు అతని మాటే పైచేయిగా ఉండటం కంటే ఇహలోక పరలోకాలలో మరేదీ నాకు ప్రియమైనది కాదు.

హజ్రత్ మున్షీ అబ్దుల్ కరీం గారు సియాల్కోటి (రజి) ఒకసారి వారు అలైహిస్సలాం ఇలా అన్నట్లు ఉల్లేఖించారు: కష్టకాలంలో మా జమాఅత్‌లోని కొందరు బలహీన హృదయుల గురించి మాకు ఆందోళన కలుగుతుంది. వారు (అ) ఇలా అన్నారు: ఒకవేళ నేను తిరస్కరించబడ్డానని, నీ కోరికలేవీ మేము నెరవేర్చమని ఆకాశం నుండి స్పష్టమైన స్వరం వినిపించినా, అల్లాహ్ సాక్ష్యంగా చెబుతున్నాను, అల్లాహ్ పట్ల నాకున్న ఈ ప్రేమలో మరియు ధార్మిక సేవలో ఎలాంటి తగ్గుదల ఏర్పడదు.

హజ్రత్ నవాబ్ ముబారకా బేగం గారు (రజి) ఇలా సెలవిచ్చారు: వారి (అ) అంతరాత్మలోని అణువణువులో దైవ ప్రేమ తరంగాలు నిండి ఉండేవి. వారి (అ) ప్రతి మాట మరియు క్రియలో అది ప్రతి నిమిషం స్పష్టంగా కనిపించేది.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఇలా సెలవిచ్చారు: ఇక్కడ ఒక వ్యక్తి ఉండేవారు, తర్వాత వారు జమాఅత్‌లో చేరారు మరియు హజ్రత్ (అ) గారితో వారికి మంచి సంబంధం ఉండేది. కానీ అహ్మదీ కాకముందు, హజ్రత్ గారు ఆ వ్యక్తిపై 20 ఏళ్ల పాటు కోపంగా ఉన్నారు. దానికి కారణం ఏమిటంటే, ఆ వ్యక్తి తన కుమారుడు మరణించినప్పుడు, 'దేవుడు నాపై పెద్ద అన్యాయం చేశాడు' అని ఆయన నోటి నుండి మాట వచ్చింది. తర్వాత అల్లాహ్ అతనికి బైఅత్ చేసే భాగ్యం కల్పించాడు మరియు అతను ఆ అజ్ఞానం నుండి బయటపడ్డాడు.

హజ్రత్ మీర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు ఉల్లేఖించారు: హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంకు తలనొప్పి సమస్య ఉండేది. ఒక వైద్యుడికి ఈ విషయంలో ప్రత్యేక నైపుణ్యం ఉండటం తో అతన్ని చాలా దూరం నుండి పిలిపించారు. అతను హుజూర్ (అ) ను చూసి, రెండు రోజుల్లో మిమ్మల్ని నయం చేస్తానని చెప్పాడు. కానీ వారు (అ) అతనితో చికిత్స చేయించుకోలేదు, ఎందుకంటే అతను దైవత్వంను ప్రకటిస్తున్నాడని భావించారు. అసలైన స్వస్థతనిచ్చేవాడు కేవలం అల్లాహ్ మాత్రమే.

హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రజి) గారి ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా సెలవిచ్చారు: నేను డల్హౌసీ వెళ్ళినప్పుడు, అక్కడి పచ్చని కొండలను మరియు ప్రవహించే నీటిని చూసి నా మనస్సులో అల్లాహ్ స్తుతి పొంగిపొర్లేది మరియు ప్రార్థనలో ఒక ప్రత్యేక మాధుర్యం కలిగేది.

గౌరవ మౌలా బక్ష్ గారి ఉల్లేఖనం ప్రకారం, ముబారక్ గారు అనారోగ్యంతో ఉన్నప్పుడు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం చాలా ఆందోళన చెందారు. సాహిబ్జాదా గారు మరణించినప్పుడు కొందరు సహచరులు పరామర్శించడానికి వచ్చారు. హుజూర్ అలైహిస్సలాం మసీదులోకి విచ్చేశారు. హుజూర్ (అ) ఎప్పటికంటే ఎక్కువగా సంతోషంగా కనిపించారు. వారు అలైహిస్సలాం ఇలా అన్నారు: ముబారక్ అహ్మద్ మరణించాడు, నా మౌలా (దేవుని) మాట నెరవేరింది. ఈ బాలుడు త్వరగా మరణిస్తాడు

లేదా చాలా దైవభీతి గలవాడు అవుతాడని అతడు (అల్లాహ్) ముందే చెప్పారు, కావున అల్లాహ్ అతన్ని పిలుచు కున్నాడు. ఒక్క ముబారక్ అహ్మద్ ఏంటి, వేల మంది కుమారులు ఉండి వారు మరణించినా, నా మౌలా (దేవుడు) సంతోషంగా ఉంటే, అనగా అతని మాట నెరవేరితే అందులోనే నాకు సంతోషం కలుగుతుంది.

లుధియానాకు చెందిన మున్షీ అహ్మద్ జాన్ (రజి) గారు హజ్‌కు వెళ్తున్నప్పుడు, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వారికి ఒక ఉత్తరం రాశారు. ఈ నిస్సహాయుడి ఒక చిన్న విన్నపాన్ని గుర్తుంచు కోండి, అల్లాహ్ అనుగ్రహంతో మీకు బైతుల్లాహ్ (ఖానా కాబా) సందర్శనం లభించినప్పుడు, ఆ పవిత్ర ప్రదేశంలో అల్లాహ్ తఆలా ఈ అల్పుడైన దాసుని తరపున ఈ పదాలలో విన్నవించండి. ఓ అత్యంత దయామయుడా! నీ ఒక నిస్సహాయ, నిష్ప్రయోజన మరియు పాపాత్ముడైన దాసుడు గులాం అహ్మద్, భారతదేశంలో ఉన్నాడు. అతని విన్నపం ఏంటంటే: ఓ అత్యంత దయామయుడా! నువ్వు నాపై ప్రసన్నుడవు అవుదువుగాక!, నా తప్పులను, పాపాలను క్షమించుగాక!, ఎందుకంటే నువ్వు క్షమాశీలివి మరియు కరుణామయుడివి. నువ్వు దేని ద్వారనైతే అత్యంత ప్రసన్నుడవుతావో అవే పనులు నా ద్వారా చేయించు. నాకు మరియు నా ఆత్మకు మధ్య తూర్పు పడమరలంత దూరం కలిగించు. నా జీవితం, మరణం మరియు నాకున్న ప్రతి శక్తిని నీ మార్గంలోనే వినియోగించు. నీ ప్రేమలోనే నన్ను బ్రతికించు, నీ ప్రేమలోనే నన్ను మరణింపజేయి మరియు నీ పరిపూర్ణ ప్రేమికులలో నన్ను పునరుత్థానం చేయి.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా సెలవిచ్చారు. అల్లాహ్‌ను ప్రేమించడం వల్ల మరియు ఆయనకు విధేయత చూపడం వల్ల కఠినమైన శిక్ష విధించబడుతుందని నాకు నమ్మకం కలిగించినా, నేను ప్రమాణం చేసి చెబుతున్నాను, నా స్వభావం ఎలాంటిదంటే ఆ కష్టాలను మరియు బాధలను కూడా ఒక మాధుర్యంతో, ప్రేమతో, ఉత్సాహంతో భరించడానికి సిద్ధంగా ఉంటుంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా అన్నారు. నాకు తెలిసిన సంకేతాలను నేను లెక్కించ లేను. నువ్వే నా దేవుడవని నేను నిన్ను గుర్తిస్తున్నాను. వారు (అ) అల్లాహ్‌ను సంబోధిస్తూ ఇలా అన్నారు. పాలు తాగే బిడ్డ తన తల్లిని చూసి ఎలా ఉరకలు వేస్తాడో, నా ఆత్మ నీ పేరు వినగానే అలాగే ఉరకలు వేస్తుంది. కానీ చాలా మంది నన్ను గుర్తించలేదు మరియు అంగీకరించలేదు.

కావున ఈ దైవ ప్రేమ మరియు అభిమానం, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తన యజమానిని అనుసరించడం వల్ల అల్లాహ్ పట్ల కలిగింది మరియు దీనినే ఆయన తన జమాఅత్‌నకు కూడా ఉపదేశించారు. వారు అలైహిస్సలాం ఇలా సెలవిచ్చారు: ప్రతి త్యాగానికి సిద్ధంగా ఉండండి. మీరు అల్లాహ్ కోసం త్యాగం చేసినప్పుడు, అతనిపై ప్రేమను వ్యక్తపరిచినప్పుడు మరియు అతని హక్కును నెరవేర్చినప్పుడు, అల్లాహ్ కూడా మిమ్మల్ని అలాగే ప్రేమిస్తాడు. అతడు మిమ్మల్ని ప్రతి శత్రువు నుండి, ప్రతి కష్టం నుండి కాపాడతాడు మరియు అతని ప్రసన్నత కోసం మీరు చేసే ప్రతి పనికి అల్లాహ్ ఇహలోకంలో మరియు పరలోకంలో అపరిమితంగా ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ మనల్ని

తనను ప్రేమించేవారిగా మరియు తనకు ప్రియమైనవారిగా చేయుగాక.

హుజూరె అన్వర్ ఇలా ఉపదేశించారు. నిన్నటి నుండి కొత్త సంవత్సరం ప్రారంభమైంది, ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఈ సంవత్సరం మనకు ఎన్నో అనుగ్రహాలను తెచ్చే సంవత్సరంగా ఉండాలని దుఆ చేయండి. అల్లాహ్ ప్రత్యర్థుల మరియు శత్రువుల పన్నాగాలను మట్టిపాలు చేయుగాక! మరియు జమాఅత్‌కు మునుపటి కంటే ఎక్కువ పురోగతిని ప్రసాదించుగాక!. బయటి దేశాలలో, ముఖ్యంగా స్వేచ్ఛాయుత దేశాలలో ఉన్న మనం కొత్త సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నాము. పాకిస్తాన్ వంటి చోట్ల కూడా ప్రజలు జరుపుకుంటున్నారు. ఇలాంటి సమయంలో జైలులో ఉన్న మన సోదరులను (ఖైదీలను) కూడా దుఆలలో గుర్తుంచుకోండి. పాకిస్తాన్ జైళ్లలో, గతంలో నేను చెప్పినట్లు ముబారక్ సాని గారికి జీవిత ఖైదు విధించారు, ఇతర సోదరులు కూడా కారాగారంలోనే ఉన్నారు. ఆ స్థితిలో కూడా వారు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కొత్త సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నారు. వారికి ఎలాంటి ఫిర్యాదు లేదు. అల్లాహ్ ప్రసన్నత కోసం వారు సంకెళ్లను ధరించారు. అల్లాహ్ వారి విడుదలకు త్వరగా మార్గాలను సుగమం చేయుగాక. మనకు మరియు కష్టాల్లో ఉన్న అహ్మదీయులందరికీ అల్లాహ్ ప్రేమ మరియు జ్ఞానం మునుపటి కంటే ఎక్కువగా లభించుగాక. కష్టాల వల్ల అల్లాహ్ పట్ల మనకున్న ప్రేమ తగ్గకూడదు, దానికి బదులుగా అది మరింత పెరగాలి. బాధితుల కోసం కూడా దుఆ చేయండి, అల్లాహ్ ప్రపంచంలోని బాధితులందరినీ క్రూరుల నుండి విడిపించుగాక! మరియు ప్రపంచంలో శాంతి నెలకొనుగాక!.

చివరగా హుజూరె అన్వర్ ముగ్గురు మృతుల గురించి ప్రస్తావించారు: గౌరవనీయురాలైన రీహానా బాస్మా గారు (సయ్యద్ అహ్మద్ నాసిర్ గారి భార్య, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పడ్ పోతీ (మునిమనవరాలు), హజ్రత్ మీర్జా సుల్తాన్ అహ్మద్ గారి పోతీ (మనవరాలు) మరియు హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్హాక్ (రజి) గారి నవాసీ (మనవరాలు). ఇలాగే గౌరవనీయురాలైన ఇఫ్ఫత్ హలీమ్ గారు (డాక్టర్ అబ్దుల్ హలీమ్ గారి భార్య, మాజీ సదర్ లజ్నా ఇమాల్లాహ్ లైబీరియా) మరియు ఈజిప్ట్‌కు చెందిన అబ్దుల్ అలీమ్ బరోబరీ గారల గురించి ప్రస్తావించారు.

ఈ ముగ్గురి పాప క్షమాపణ మరియు ఉన్నత స్థాయి అంతస్తుల పురోగతి కోసం దుఆ చేసి, వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ - وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ - وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ
وَرَسُوْلُہٗ - عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ - یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ - اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ -